"దుర్గా! దుర్గా! కాఫీ!!" హుషారుగా పిల్చాడు రాజేష్.

ముభావంగా వెళ్ళి కాఫీ అందించింది— దుర్గ.

"ఏమిటోయ్! అలా డల్‌గా వున్నావ్?"

"…………"

"ఓహో రాత్రి బాగా తాగొచ్చానని కోపమా? సారీ డియర్, ఫ్రెండ్స్ బలవంతం మీద తీసుకున్నా నంతే. ఈసారికి క్షమించే సేయ్. మా బంగారు దుర్గవి కదూ!" దుర్గ చుబుకం పట్టి ముద్దుగా అన్నాడు రాజేష్.

నవ్వుతూ వెళ్ళింది దుర్గ.

"నాన్నా! నాన్నా! మరేమో! నాకే….రాత్రే ….బాగా జ్వర మొచ్చేసింది. నువ్వు రాత్రి రాలేదేం నాన్నా ఇంటికి?" గారాంగా అడిగాడు బాబు.

"వచ్చా న్నాన్నా! మరి నువ్వేమో మాంచి నిద్రలో వున్నావు. నిద్ర పాడౌతుందని లేపలే దంతే!" బాబుని మంచి చేసేసుకునే దృష్టితో ముద్దుగానే చెప్పాడు రాజేష్.

"నాన్నా! డాన్స్ స్కూల్ కెళ్తున్నా" విసురుగా అనేసి దూకుడుగా వెళ్ళింది పాప.

"ఓహో! పాపక్కూడ తెల్సినట్టుందే రాత్రి వ్యవహారం? ఒక్క సినిమా ప్రోగ్రాం వేశా మంటే సరి. ఆ కోపమంతా ఎగిరిపోతుంది" అనుకుంటూ ఆఫీస్ కెళ్ళాడు రాజేష్.

ర ర ర

సాయంత్రం అయిదు కావస్తూంది. దుర్గ పనంతా ముగించి ముస్తాబై భర్తకోసం ఎదురు చూస్తూ నిల్చుంది. పాప లోపల డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తూంది. బాబు ఏవో చదువు తున్నాడు. చంటిది ఆడుకుంటూంది. హుషారుగా ఈల వేసుకుంటూ వచ్చాడు రాజేష్.

"హాయ్! డార్లింగ్! యెక్కడికోయ్? ముస్తాబైనావ్?"

"ఓహో సినిమాకు కదూ! ఊఁ….వెరీ క్విక్. పాపా! బాబూ! త్వరగా రెడీ కావాలి. సినిమా కెళ్తున్నాం" ఉషారుగా గుక్క తిప్పుకోకుండా పిల్చాడు.

ఆ రోజు సినిమా కెళ్ళారు. ఇంటర్వెల్‌లో చాక్లెట్స్, డ్రింక్స్. అబ్బ! ఎన్నో!!

తర్వాత సర్దాగా హోటల్లో భోంచేశారు.

ఓ పదిరోజులు సరదాగా గడిచాయి.

ర ర ర

రాత్రి పది కావస్తూంది. గడియారం టిక్కు టిక్కుమంటోంది. పిల్లలు నిద్రపోతున్నారు. దుర్గ జోగుతోంది. భయంకరమైన నిశ్శబ్దం!!

"దుర్గా! దుర్గా!" భర్త కఠినమైన పిలుపు.

తర్వాత—తిట్ల వర్షం!!

జీవితంమీద విరక్తితో, నూతిగట్టు మీద దుర్గ!! కళ్ళ ముందు పచ్చని వలయాలు!!

పాప జాలి చూపు!!

బాబు కలవరింత!;

చంటిదాని ఏడుపు!!!

రాజేష్ అసహాయత!!!

మౌనంగా వచ్చి పడుకుంది దుర్గ.

ర ర ర

"హల్లో! దుర్గా! పిల్లలేరి? అబ్బ! అచ్చం నీ వెలా వున్నావంటే అప్సరసలా వున్నావ్" రాజేష్ పొగడ్త.

దుర్గ మౌనం!

పాప కోపం!!

బాబు ఎదురు చూపు!!

అన్నీ మామూలే!!

ర ర ర

"ఏయ్ దుర్గా! తలుపు తెరవ్వే! ఇడియట్!" తర్వాత తిట్ల వర్షం.

జీవితంమీద విరక్తితో. నూతిగట్టుమీద దుర్గ!

పాప జాలి చూపు!

బాబు కలవరింత!

చంటిదాని ఏడుపు!!!

రాజేష్ అసహాయత!!!

□

జ్యోతి





# సహజాతాలు

పియస్వీ.రమణారావు

"… ఒరేయ్ వాసూ! వోరి వాసూ!….ఆ దరిద్రగొట్టు ముండ మళ్ళీ పెరట్లో జొరబడినట్లుంది. చూడారే….కాలు విరగ్గొట్టి, మరోసారి గుమ్మం తొక్కకుండా…."

వెంటనే—

వో బరువయిన వస్తు వేదో విసిరేసిన చప్పుడూ,

వెనువెంటనే—

"కుఁయ్యో" మని హృదయవిదారకంగా, పరుగెడుతున్న అరుపూ,

వినబడేసరికి—

గుండెల్ని దేవేసినట్లయింది,

కడుపులో ప్రాణం కదిలినట్లయింది,

హేమకి!

తన నా వూరికి, ఆ యింట్లోకి, ఆ చీకటి గదిలోకి, తీసుకొచ్చినప్పటికి,

త నే స్థితిలో వుందో—

సరిగ్గా, అదే రోజు—

అంతవరకూ, అల్లారుముద్దుగా పెంచుకునీ, ఇప్పుడు మాత్రం దాని పొడంటే గిట్టక, అల్లంత దూరంలో కనిపిస్తే చాలు, దాన్ని గుమ్మం యెక్కనీకుండా, రాళ్ళతో తరిమి తరిమి కొట్టేస్తున్న, ఆ యిల్లుగలవాళ్ళ కుక్క కూడా—

అదే స్థితిలో వుంది!

తల్లీ, అన్నా కలిసి, బలవంతంగా, తన నీ వూరికి ఈడ్చుకు రావడఁవూ—

అదే రోజు, ఆ ఇల్లుగలవాళ్ళు, వాళ్ళ

కుక్కని తరిమి కొట్టడవూ—

రెండూ వొక్కలాగే వున్నాయనిపించాయి, హేమకి.

"....ఎంత పాలూ అన్నం దాని మొహాన్న పోసి పెంచితే మాత్రం, దిక్కుమాలిన కుక్క, దాని బుద్ధి పోనిచ్చుకుంటుందిటండీ...."

కుక్కని తరిమికొట్టిన రోజున, ఇల్లుగలావిడ, అన్న మాటలు—

జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా,

"....పువ్వుల్లో పెట్టి పెంచుకున్నందుకూ, నువ్వాడింది ఆట, పాడింది పాటగా చెల్లుబాటు చేసినందుకూ, మమ్మల్ని నలుగుర్లోనూ తలెత్తుకొని తిరగనీకుండా, తగిన శాస్తినే చేశావు. వయసొచ్చిన ఆడపిల్లలెందరేరూ భూమ్మీద? అందరూ ఇలాగే వొళ్ళు పొగరెక్కి వీధిని బడ్డారా? ఛి, ఛీ...."

తన సంగతి, యింట్లో తెలిసిన మొదటి క్షణంలో, కన్నతండ్రి అన్న మాటలు—

జ్ఞాపకం వొస్తుంటాయి, హేమకి.

నిష్కల్మషంగా, ప్రాణానికి ప్రాణంగా, ప్రేమించిన మూర్తి,

ఆ రోజు,

వర్షంలో చిక్కుబడిపోయిన,

చీకటి క్షణాల్లో,

ఎందుకలా తొందరపడ్డాడో,

తప్పంతా అతనిదేనా?

తనేం జేసింది?

అతను తొందరపడినా,

మున్నెన్నడూ యెరగని ఆ వెచ్చని అనుభూతికి,

తను లొంగకుండా ఎందుకుండలేక పోయిందనీ?

ఆ వొక్క క్షణం, తను వారించి వుండగలిగినట్టయితే,

ఇప్పుడిలా, పదిమందిలో....

కన్నీటి ప్రవాహం ఆపుకో శక్యం కానిదయిపోయింది, హేమకి.

"....పెద్దల అనుమతి లేకుండా, కట్టుబాట్లు మరిచి, తొందరపడ్డం తప్పే. అయినా మించిపోయిందేం లేదు. నా జీవితానికి దేవుడిచ్చిన గొప్ప వరం హేమ. దయచేసి మా పెళ్ళికి అనుమతించండి. హేమను నా తలమీద పెట్టుకుని పూజించుకుంటాను...."

తనవాళ్ళ ముందు, దీనాతిదీనంగా, మిక్కిలి ప్రాధేయపడిన మూర్తిని, అతని సంస్కారాన్నయినా గుర్తించకుండా తన అన్న మూర్తిని చాచి కొట్టినా కూడా—

"నామీద మీకున్న కోపం ఏ రూపంలోనయినా తీర్చుకోండి. కాని నా నుంచి హేమను దూరం చెయ్యాలని మాత్రం దయచేసి ప్రయత్నం చెయ్యకండి. నేను జీవించలేను."

అంతటి అవమానాన్ని సహించీ, మూర్తి అన్నా;

"నీ అంతరం ఎక్కడ? మా అంతరం ఎక్కడరా? కట్టుకున్న పెళ్ళాంకి కడుపునిండా తిండయినా పెట్టలేని అణా కానీ వెధవ్వి. నా కూతుర్ని పెళ్ళి చేసుకుంటాననడానికి నీ బ్రతుకెంత? నువ్వెంతరా? చేసిన వెధవపని చాలక, నా ఎదట నిలబడి ఆ మాట అనడానికి నీ కెన్ని గుండెల్రా? యూ, స్కౌండ్రల్. గెటవుట్, గెటవుట్, ఈ ఛాయల మళ్ళీ కనిపించావో తవ్వి పాతేయించేస్తాను."

నానా మాటలూ అని, మనిషి కుండవలసిన కనీస సభ్యత కూడా మరిచి, తన తండ్రి మూర్తిని మెడ పట్టుకుని బయటికి, తన కళ్ళెదుటే, గెంటుతున్నప్పుడు—

నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ, చూడటం మినహా,

తనేం చెయ్యగలిగిందా రోజు?

ఎదిరించి, ధైర్యంగా, మూర్తి వెంట, ఎందుకు వెళ్ళలేక పోయిందీ?

రాళ్ళుచ్చుకుని, తరిమి తరిమి కొడుతున్నా, ఇల్లుగలవాళ్ళ కుక్క ఆ యింట్లోనే పట్టుకుని, పదే పదే వేళ్ళాడుతుం దెందుకనీ?


వొకప్పుడు పాలూ అన్నం పెట్టించారని, తన జాతి లక్షణ విశ్వాసమా? అది.

అలాంటప్పుడు—

పుట్టింటిమీద ఆడపిల్లకున్న **విశ్వాసమూ**, అలాంటిదేనా?

కాక?






తను నెత్తీ నోరూ బాదుకుంటున్నా, వీల్లేదని, తండ్రి అన్నా కలిసి డాక్టర్ల దగ్గరకు తిప్పితే, తిరగాలేదూ తను?

"కుదుర్దు. తల్లి ప్రాణానికి ప్రమాదం" అని డాక్టర్లన్నప్పుడు,

మూడో కంటివాడికి తెలీకుండా, ఈ బరువొదిలించేద్దామని, తల్లీ అన్నా కలిసి, ఇన్ని వందలమైళ్ళు బలవంతంగా ఈడ్చుకొస్తే,

రాక, ఏం చేయగలిగింది తను?

ఈ బరువేదో వొదిలిన్తర్వాత—

తన మెడలు వొంచి, ఎవడిచేతో మూడు ముళ్ళూ వేయించేసి, తమ పరువు నిలబెట్టుకో చూస్తే—

అప్పుడు మాత్రం, యెదిరించ గలదా తను?....

"—పోనీండి అక్కయ్యగారూ, దిక్కుమాలిన ముండ యెక్కడకని పోతుందీ? అలవాటయిన పంచ. చూస్తూవుంటే నేడో రేపో, ఈనేసేలా వుంది. పెరట్లోనే కదా, వుణ్ణిదురూ—"

ఇల్లుగలావిడతో, తల్లి అంటున్న మాటలు, హేమకి వినిపించగానే ఆమె ఆలోచనలు అక్కడికి ఆగేయి.

"అది కాదండీ....మెడ్రా వెళ్ళినప్పుడూ, జాతి కుక్క కదాని, దాని ఏదాన్న నాలుగొందలు పోసి, ఇంతప్పుడు దాన్ని కొనుక్కొచ్చాడు మా పెద్దాడు. మా యింటి కొచ్చిన రెండు నెల్లకి, దువ్వలా రూపూ, గువ్వలా గంతూ, తేలిందంటే, దానికేం సామాన్యమైన తిండి పెట్టాలనుకున్నారా ఏం? మాతో సమానంగా దానికి తిండి పెట్టాలంటే మీరు నమ్మరు. దాని జాతిదే, గుర్రంలాంటి మొగకుక్క, డాక్టరు రాజాగారింట వుంది. ఇదిగో, దానితో జత కలిపిద్దాం అని అనుకుంటున్నామో లేదో, వొళ్ళు కొవ్వెక్కి, కట్టు తెంపుకుని, వీధిని బడి, అడ్డమైన వెధవ కుక్కలతోనూ పోయింది. ఆ దిక్కుమాలిన సంతు అంతా పెరట్లోనే కంటా నంటే.... ఛి, ఛీ—"

ఇల్లుగలావిడ మాటలొక్కొక్కటీ ఒక్కొక్క సూదయి గుచ్చుకొన్నాయి, హేమ చెవులికి.

తల్లికూడా నిస్సహాయంగా చూస్తూ, మారు మాటాడకపోవడంతో, ఆ బాధ మరింతైంది హేమకి.

* * *

డాక్టరు దగ్గిర కెళ్ళి, తిరిగొస్తున్న హేమకి—

రోడ్డువార, చెట్టుక్రింద, పక్క లెగరేసుకుంటూ కళ్ళు మూసుకొని పడుకున్న, ఇల్లుగలవాళ్ళ కుక్క కనిపించింది.

రిక్షాలో బరువుగా వాలి కూర్చున్న, తన వేపోసారి చూసుకొందామె.

"పెరట్లో వో మూలగా పడుకోనిచ్చి, వాళ్ళు తినగా పారేసిన యిన్ని మెతుకులు దానికి పడేస్తే నేంపోయింది వాళ్ళ సొమ్మూ? బొత్తిగా దయాదాక్షిణ్యం లేని వెధవలు—"

తన ప్రక్కన కూర్చున్న తల్లి అనేసరికి;

తల్లివేపు చూసిందామె.

"—ఎక్కడికో దూరంగా తీసుకుపోయి, ఈ మచ్చ వొదిలించుకోపోతే, పదిమందిలో మన పరువేంగానూ? వొంటికి జబ్బొస్తే, వొదిలించుకోటంలా? ఇదీ అంతే....కడుపులో పుట్టిన పుండనుకోటంవూ—"

తనెక్కడికీ రానని మొరాయించినప్పుడు, తండ్రి అన్న మాటలు చటుక్కున జ్ఞాపకం వొచ్చాయి, హేమకి!

తల్లికీ, తండ్రికీ, తనమీదున్న, సానుభూతిని, తల్చుకునేసరికి—

శరీరం అంతా కంపించిపోయింది, ఆమెకి!

"కుక్కకే, తల్లీదండ్రీ వుండుంటే, యే మెడ్రాసో, బెంగుళూరో, తీసుకుపోయి, దాని కొచ్చిన మచ్చ మాపుకొనే వాళ్ళేమో" అని, అందామనుకుని—

'ఛీ' అని తనలో మాత్రం అనుకుని, వూరుకుంది హేమ.

—రిక్షా యింటిముందు ఆగే వేళకి, ఎదురొచ్చి,

"యేఁవంది డాక్టరూ?...." అడిగాడు, అన్న.

"ఇంక రెండ్రోజుల్లో రావచ్చంది...."అంది తల్లి.

"ఏదో అయిపోతే బాగుండును, వెధవది, ఎన్నాళ్ళిక్కడుండటం?"

"బావుందిరా నువ్వన్న మాట....మన చేతుల్లో ఏం వుందీ?"

"చేతుల్లో కాదు....ఖర్మ, మన రాతల్లో వుంది"విసుగ్గా అనేసి చరచరా బయటికి వెళ్ళిపోయాడు అన్న.

గదిలో మంచంమీద కూర్చుని, ఈ సంభాషణంతా వింటున్న, హేమకి—

"అయిపోతే బాగుండును. తనని మళ్ళీ వెనక్కి తీసుకెళ్ళాల్సిన అవసరం రాకుండా, అంతా, ఇక్కడయిపోతేనే బాగుండును, తన పీడ వొదిలిపోతుంది వీళ్ళందరికీ" అని, అనిపించగానే—

"నా సంగతేం జెప్తావ"ని,

కడుపులోంచి యెవరో ప్రశ్నించినట్టయింది!

*  *  *

ఆ రాత్రి

అన్నం తింటున్నప్పుడు, ప్రక్కలో సన్నగా మొదలయిన నొప్పి, పొత్తికడుపులో ప్రవేశించి, క్రమేపీ, కొండంత అయి, పది నిముషాల్లో చుట్టుముట్టేసింది, హేమని.

తల్లి కంగారు పడిపోయి కొడుకుని పంపించి, నర్సుని తీసుకురమ్మని.

మెలికలు తిరిగిపోతూ, చుట్టుకుపోతోంది హేమ.

"—ఎంత కొట్టినా కదల్టంలేదే అమ్మా. దాని వాలకం చూస్తుంటే చచ్చినాల్లా వుందే—"

ఇల్లుగలవాళ్ళ చిన్నబ్బాయి అంటున్నాడు, వాళ్ళమ్మతో.

"అదెందుకు ఛస్తుందిరా బాబూ, దిక్కుమాలిన పిల్లల్ని పెట్టి, మనల్ని చంపుతుంది గానీ—చోద్యం చూస్తున్నట్టు కూర్చున్నావేంరా....తగిలేసి తలుపెయ్యకా-" అంటోంది ఆవిడ.

"పోన్లేవే....ఈ రాత్రప్పుడు యెక్కడికి పోతుందదీ? తెల్లారేకా, దాన్నీ, పిల్లల్ని కలిపి తరిమేయొచ్చు....వుణ్డియే" అంటున్నాడా అబ్బాయి జాలితో.

అంత మరణవేదనలోనూ, ఇదంతా వినబడుతోంది హేమకి.

వొక్కసారి భయంగా, రెండు చేతుల్తోనూ








కడుపులోని ప్రాణాన్ని పొదువుకుని 'అమ్మా' అని అరిచింది.

"పార్వతమ్మగారూ, ఓసారిలా వస్తారూ?" తల్లి పిలుస్తోంది, యిల్లుగలావిడని, కంగారుగా.

ఆమె వొస్తోందంటే, హేమ గజ గజ వొణికిపోయింది.

తల్లీ, అన్నా కలిసి, గుట్టుగా ఈ సంగతి దాచబట్టిగానీ—

ఆవిడకు తెలిస్తేనా?

ఇంట్లోంచి బయటకు గెంటేదూ?

కుక్కకే గతిలేకపోయింది!

సరిగ్గా అదే సమయానికి, నర్సుని తీసుకుని అన్న వొచ్చాడు.

వొక గంటకి పైగా—

ఆమె ప్రాణం అనుభవించిన చిత్రహింసకి ఫలితంగా—

'కేర్' మంటూ—

ఆమెలోంచి మరో ప్రాణం భూమ్మీద పడింది.

'మొగపిల్లాడు' అని నర్స్ అంటున్న క్షణంలోనే—

"....అమ్మా....అమ్మా....మన కుక్కేం మూడు పిల్లల్ని పెట్టిందేవ్....ఎంత ముద్దుగా వున్నాయనుకొన్నావ్—"

పరుగెత్తుకొంటూ వొచ్చి, అంది ఇల్లుగలవాళ్ళమ్మాయి.

"ముద్దేఁవిటే నీ మొహమ్మండా....దరిద్ర గొట్టు ముండాకుక్క పెరడంతా పెంట చేసుంటుంది—వుండండమ్మా వొస్తాను—"

అంటూ యిల్లుగలావిడ వెళ్ళిన మరుక్షణం—

వొళ్ళంతా నీరసం ఆవహించి మైకం కమ్ముకొంది హేమని!

—ఆ మగతలోంచి తేరుకోటానికి, గంటకి పైనే పట్టింది ఆమెకి.

తెలివొచ్చిన ఉత్తరక్షణం—

ఆమె చేతులు మంచంమీద, తన పక్కలో ఆత్రంగా వెతుకుతున్నాయి—

ఎంత తడిమి చూసుకున్నా, వుట్టి మంచమే తగుల్తోంది—

రెండు ప్రక్కలా తిరిగి చూసుకొంది—

ఎక్కడా తన చిన్నారి ప్రాణం కనిపించ లేదు—

ఎక్కడ?

వోపిక తెచ్చుకొని, లేచి కూర్చుని, గదంతా కలయ చూసింది.

ఎంత కళ్ళు చించుకొన్నా,

శూన్యమే!

ఏదీ తన చిన్నారి బాబూ?

వాడు భూమ్మీద పడగానే, 'కేర్' మనడం తను వింది!

ధారాళంగా అంత బలు వుండేవాడు నాయన!

కడుపంతా చెరువు చేసుచేసుకొని కదిలే వాడు,

తన కడుపు చెరువు చేసి, పోలేదు కదా?

ఆ వొక్క ఆలోచనతో,

మతిపోయింది హేమకి!

పుట్టెడు నీరసం మళ్ళీ కమ్ముకొచ్చి,

స్పృహ తప్పింది!

*   *   *

హేమకి, మెలకువ వొచ్చేసరికి—

పక్కవాటాలోంచి, ఇల్లుగలావిడ, పెద్ద 'పెడబొబ్బ' పెట్టి,

"....దిక్కుమాలిన ముండ, నా కొంపకి కనిలా దాపురించింది తల్లో, ప్రాణం కొరికేసింది, దీనమ్మ కడుపు కాలా...." అంటూ, పెడుతున్న శోకాలు వినిపిస్తున్నాయి.

"ఏం జరిగింది పార్వతమ్మగారూ?" ఎవరో అడుగుతున్నదానికి,

"ఏంచెప్పను తల్లీ, కనిగొట్టు ముండాకుక్క పుట్టింటి కొచ్చినట్లు, రాత్రి పెరట్లో ఈనీసింది కదా....పైకి తగిలేద్దామనీ పిల్లాడు దగ్గరకెళితే 'గుర్రు'గా చూస్తోందన్నాడని, నేఁ వెళ్ళి, వొక పిల్ల నింకా ముట్టుకున్నానో లేదో, పెద్దపులిలా మీద కురికి, కండ వూడిపీకేసిందే తల్లీ.... ఏఁవన్రా, ఎవన్రా అక్కడా? ముక్క వూడిపోయి రక్తం కాలవగట్టేస్తోంది....డాక్టరు దగ్గిరకు తీసుకు పొండ్రా నన్నూ...."

గగ్గోలు పెట్టి యేడ్చేస్తోంది, యిల్లుగలావిడ.

చటుక్కున యేదో జ్ఞాపకం వొచ్చిన హేమ, పక్కకు తిరిగి పక్కలో చూసుకొంది.

ఖాళీ మంచం!

తన పేగులు కదిలించి బయట కొచ్చిన,

తన పేగులో పేగు,

తన ప్రాణంలో ప్రాణం,

ఏడీ తన బాబు ఏడీ?

"....చూడండమ్మగారూ .... కలికాలం.... ఏటవతలొడ్డుకి పసిగుడ్డు శవం కొట్టుకొచ్చిందట; మా పేటవోల్లంతా సుద్దానికి పారెల్లినారు....ఏ ముండకొచ్చిందో పోయేకాలం.... వోల్లు పొగరెక్కినప్పుడున్న ధైర్యవూఁ కన్నప్పు డేటయిపోనాదో....పేణఁ వున్న పసికందుని పారేయటానికి, దానికి సేతులెలా వొచ్చాయో పాపిష్టిముండ...."

అప్పుడే పనిలోకొచ్చిన పనిమనిషి అంటున్న మాటలు వినబడేసరికి—

తల్లి ప్రాణం హేమ రొమ్ముల్లోంచి పాలయి చాలా ఆవేశంతో చివ్వున చిమ్మేసరికి; తట్టుకోలేక—

"అమ్మా!"

భూమి బ్రద్దలయిన అరుపు అరిచి—

తన కఠోర స్వరానికి తనే చెవులు మూసుకొంది!

"ఏం తల్లీ? ఎందుకమ్మా పిలిచావు?"

తల్లి కంగారుగా పరుగెత్తు కొచ్చి అడిగింది.

కాని, సూటిగా తన మొహం చూడలేకపోడాన్ని, పసికట్టిన హేమ—

"నా పిల్లాడు? నా పిల్లా డేడమ్మా?"సూటిగా తల్లి నడిగింది.

"........."

సమాధానమివ్వకుండా మొహం పక్కకు తిప్పుకున్న తల్లిని,

"వొక్కసారి చూపించమ్మా నా బాబుని" అతి దీనంగా అడిగింది.

అంతవరకూ పక్క గదిలోంచి ఆ మాటలు వింటున్న ఆమె అన్న రివ్వున వొచ్చి—

"నువ్వు బైట కెళ్ళమ్మా" తల్లి రెక్క పుచ్చుకొని, బైటికి పంపించేసి;

"ఏఁవిటీ?" అనడిగాడు చెల్లిని చూస్తూ.

"నా బాబు ఏడీ? ఎక్కడున్నాడు? నాకు వెంటనే చూపించాలి"

చాలా సూటిగా అడిగింది.





"నీకు బాబు పుట్టాడని ఎవరు చెప్పేరు? నీ కసలు ఏ పిల్లా పుట్టలేదు. ఇంత నెత్తురుముద్ద బైట పడింది. చచ్చిన పిండం, బైట పారేసాం."

చాలా కంగారుగా అన్నాడు.

తన కడుపులోని పేగులన్నీ వొక్కసారి తెంపేసినట్టయింది హేమకి!

"అబద్ధం" చేతులు అటూ ఇటూ నెరుపుతూ పొట్టమీద తడుముకొంటూ బాధగా అరిచింది.

ఆమె అన్న యే మాత్రం చలించలేదు!

ఆ మౌనం చూసి ఆమె సహించలేక,

"పుట్టగానే 'కేవ్' మన్న నా బాబు గొంతు నేను విన్నాన్రా. నాకు తెలుసురా....యేం చేసార్రా? కన్నయినా తెరవలేని నా చిన్నారి బాబుని....వొక్కసారి చూపించండ్రా...." ఆక్రోశిస్తూ అడిగింది.

"విన్నావా? అయితే వినేవుంటావు. మళ్ళీ చెప్తున్నాను విను. నీకు మొగపిల్లాడే పుట్టాడు. పుట్టిన పావుగంటకి చచ్చేడు; సరా"

చాలా తేలిగ్గా అన్నాడతను.

కడుపులో అలలు అలలుగా తిరుగుతున్న బాధ, వొక్కసారి పెద్ద కెరటమై, ఉవ్వెత్తున లేచి గుండెల్ని చుట్టుముట్టేసరికి—

"చచ్చిపోయాడా? చంపేసారా?" చాలా తీక్ష్ణంగా అడిగింది హేమ.

"నీకేం పిచ్చెక్కిందా?" విసుగ్గా అన్నాడతను.

"నా బాబును నాకు చూపించకపోతే నాకేఁవన్నా ఎక్కుతుందిరా. చెప్పు. ఏటొడ్డుకి కొట్టుకొచ్చిన పిల్లాడి శవం ఎవరిది?"

"నాకేం తెలుసు? నేనేం వెళ్ళి చూసొచ్చానా?"

"వెళ్ళి పారేసొచ్చినవాడివి, నీక్కాపోతే ఇంకెవరికిరా తెలుస్తుందీ?"

"నోటికొచ్చినట్టు పేలక."

హేమకి నరాలన్నీ బిగుసుకొన్నాయి.

పక్కమీంచి రివ్వున లేచింది.

పిడికిళ్ళు బిగించింది.

పళ్ళు కొరికింది

శంఖంలాంటి అన్న గొంతు ముడి పట్టుకోవాలని

ఛెంగున అతనిమీద కురికింది

ఆడపులిలా!

క్షణంలో పరిస్థితి గ్రహించిన వేటగాడిలా

వొడుపుగా పక్కకు తప్పుకున్నాడతను.

ఉరికిన ఆమె దభీమని కింద పడిపోయింది!

"బాబూ....వొరే కన్నా....నా తండ్రీ...." పిచ్చిగా అరుస్తూ బైటకి పరుగెత్తబోతున్న హేమ రెక్క పుచ్చుకొని, ఈడ్చుకొచ్చి మంచంమీద కూలదోసాడు ఆమె అన్న.

"జరిగినదానికి నువ్వు చేసేదేం లేదుగానీ, కళ్ళు మూసుకుని పడుకో. పిచ్చి పిచ్చిగా ఆలోచించక" అన్నాడతను వెళ్ళబోతూ.

"అవున్రా, నేనేం చెయ్యగలన్రా? పిచ్చిదాన్ని కాబట్టే మీ వెంట వొచ్చాన్రా. అప్పుడే యెదిరిస్తే నా బ్రతుకిలా కుక్కకన్నా హీనంగా తయారయేది కాదురా........ నన్ను పెట్టిన వుసురు పుట్టినే పోదురా.... బాబూ....నా కన్నా....వాళ్ళు కాదురా.... నేనేరా నిన్ను చంపేసిన రాక్షసిని....నా కడుపునెందుకు పుట్టేవురా నాయనా...."

పేగులు తెగిపోయేలా పెద్దపెట్టున ఏడుస్తూ తల బాదుకుంది, జుట్టు పీక్కుంది, చీర ముక్క ముక్కలుగా చింపుకుంది.

ఆ తర్వాత—

మరి ఏ ఆక్రోశం గానీ, ఆక్రందన గానీ, ఆమెనుంచి రాలేదు.

మూసుకుపోతున్న ఆమె కన్నుల్లో,

పాలు తాగుతూ, తన వొడంతా చిన్ని చిన్ని కాళ్ళతో కుమ్మేస్తూ తిరుగాడుతూన్న తన పిల్లల్ని అరమోడ్పు కన్నులతో చూసుకుంటూ ఆ మధురాతి మధురమైన పులకింతకి మైమరచి మురిసిపోతున్న—

ఇల్లుగలవాళ్ళ కుక్క—

చివరి దృశ్యమై నిలిచిపోయింది! □